సాక్షి
ఏలూరు

బుధవారం । 24 । జనవరి । 2024



సేంద్రియ సాగే మేలు

రసాయన ఎరువుల అధిక వినియోగంతో పంటలో సూక్ష్మ పోషకాలు లోపిస్తాయి. సేంద్రియ సాగు వల్ల ఈ సమస్యలకు చెక్ పెట్టవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 10 లో



పర్యావరణాన్ని రక్షించాలి

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరులో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 10 లో



పులి పాదముద్రల సేకరణ

బుట్టాయగూడెం మండలం ఎర్రాయిగూడెం సమీపంలో పులి పాదముద్రలను మంగళవారం ఫారెస్ట్ అధికారులు సేకరించారు. వాటిని రాజమండ్రి ల్యాబొరేటరీకి పంపించారు. 10 లో

పేదలకు ఆరోగ్య భరోసా

- 8 నెలల్లో రూ.92 కోట్ల విలువైన సేవలు
- ఏలురు జిల్లాలో 40 వేల మందికి వైద్యం
- ఆరోగ్య ఆసరాలో 10 వేల మందికి అండగా
- 3225 వ్యాధులకు ఉచితంగా వైద్య చికిత్సలు



ఏలూరు టౌన్: సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత విస్తృతం చేశారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 2023 ఏప్రిల్ నుంచి 2023 నవంబర్ 30వ తేదీ వరకు కేవలం 8 నెలల కాలంలోనే వేలాది మందికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో లబ్ధి చేకూరింది. ఏలూరు జిల్లాలో 16,407 మందికి ఆయా అనారోగ్యాలకు శస్త్రచికిత్సలు నిర్వహించారు. సుమారుగా రూ.37.69 కోట్ల నిధులను ఖర్చు చేశారు. ఇక వెయ్యికిపైబడిన చికిత్సలకు సంబంధించి వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో 22,755 మంది రోగులు లబ్ధి పొందగా వారికి రూ.55.92 కోట్లు నిధులను వెచ్చించారు.

ఆరోగ్య ఆసరాలో 10 వేల మందికి అండగా: మహానేత వైఎస్సార్ ప్రభుత్వంలో పేదలకు పెద్ద రోగం వచ్చినా ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలులోకి తెచ్చారు. ఆనాడు ఈ పథకంలో కేవలం 1100 వ్యాధులకు మాత్రమే వైద్య చికిత్సలు, సేవలు అందించేవారు. అనంతరం కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. 2019లో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి నూతన జవసత్వాలు తెచ్చారు. 2019లో వ్యాధుల సంఖ్యను 2021కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం నేడు 3,225 వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువస్తూ సేవలు అందిస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఆరోగ్య ఆసరాకు సంబంధించి 8 నెలల కాలంలో 10,587 మంది రోగులకు ఆసరా కింద రూ.5.97 కోట్లు సొమ్ములను అందజేశారు.



‘ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి ఎం.జీవన్ సందీప్, రమ్యలకు ఏడాది వయస్సు ఉన్న చిన్నారి జీవన అమృత జన్మించింది. పుట్టుకతోనే రెండు చెవులు వినిపించకపోవడంతో ఆమెను ఆసుపత్రికి తీసుకువెళ్లాం. వైద్యులు పరీక్షించి రెండు చెవులకు కాంక్లియర్ ఆపరేషన్ చేయాలని, ఇందుకోసం రూ.10 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. మా దగ్గర అంత డబ్బు లేకపోవడంతో ఏం చేయాలా అని చాలా బాధపడ్డాం. కానీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. అలాగే ఆపరేషన్ చేయడానికి ప్రభుత్వం రూ.10,67,288 ఖర్చు చేసింది. ఇప్పుడు మా పాప రెండు చెవులు వినపడుతున్నాయి. చిన్న చిన్న మాటలు కూడా వస్తున్నాయి. ఇంత సాయం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు మేము జీవితాంతం రుణపడి ఉంటాం’.



‘నూజివీడు మండలం తుక్కులూరు గ్రామానికి చెందిన బోకినాల చంటిబాబు, కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన రెండేళ్ళ ఎనిమిది నెలల చిన్నారి అవంతికకు గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోంది. కూలీ పనులు చేసుకునే తనకు కుమార్తెకు ఏమైందో తెలియక ఆందోళనకు గురయ్యాడు. ఏ విధంగా వైద్యం చేయించాలో అనుకుంటూ హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్ చేస్తారని ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్ వారు చెప్పడంతో అతని ఆనందానికి అవధులు లేవు. చిన్నారికి శస్త్రచికిత్స చేసేందుకు రూ.1,42,993 నిధులను ప్రభుత్వం ఖర్చు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడటం వల్లే ఇది సాధ్యమైంది. ఆయనకు కృతజ్ఞతలు’.

జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఉదంతాలు వేలల్లో ఉన్నాయి. దివంగత మహానేత వైఎస్సార్ ఆనాడు మహోన్నత లక్ష్యంతో పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తే నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండడుగులు ముందుకు వేసి ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స అందించే వ్యాధుల సంఖ్యను పెంచడమే కాక వైద్య ఖర్చులను సైతం రూ.25 లక్షలకు పెంచి తాను మరింత మేలు చేస్తారని నిరూపించుకున్నారు.

103 ఆస్పత్రుల ద్వారా వైద్య సేవలు



ఏలూరు జిల్లా వ్యాప్తంగా 103 హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ పథకంలో ప్రజలకు సేవలు అందుబాటులో ఉన్నాయి. 29 ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్, 7 డెంటల్ హాస్పిటల్స్, ఏలూరు జీజీహెచ్‌తో పాటు, రెండు ఏరియా ఆసుపత్రులు, 6 సీహెచ్‌సీలు, 58 పీహెచ్‌సీల్లోనూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.92 కోట్ల నిధులను ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్రచికిత్సలు, వైద్యసేవలకు ప్రభుత్వం వెచ్చించింది.

– డాక్టర్ ఐ.రాజీవ్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్

న్యూస్‌రీల్

ఉపయోగంలో లేని చెక్కులు, స్టాంప్‌ల దహనం



స్టాంప్‌లు, చెక్కు పుస్తకాలు దహనం చేస్తున్న దృశ్యం

ఏలూరు (మెట్రో) : జిల్లా ఖజానా కార్యాలయంతో పాటు జిల్లాలో ఉన్న ఎనిమిది ఉప ఖజానా కార్యాలయాల్లో ఉపయోగంలో లేని చెక్కుబుక్కులు, స్టాంప్‌లను మంగళవారం దహనం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఉపయోగంలో లేని 3,420 చెక్కు బుక్కులు, రూ.16,12,985.60 విలువ చేసే వివిధ రకాల స్టాంపులను దహనం చేసినట్లు జిల్లా ఖజానా అధికారి టి.కృష్ణ తెలిపారు. జీఓ నంబర్ 135 ప్రకారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో పదిమంది జిల్లా స్థాయి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ఆదేశాల మేరకు జిల్లా రిజిస్ట్రార్, డిప్యూటీ కార్యనిర్వహణ అధికారి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, ఏలూరు జిల్లా ఖజానా అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఏలూరు జిల్లాలోని ఉపఖజానా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ‘హ్యాపీ డ్రైవర్స్ డే’

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రోడ్డు భద్రతా మాసోత్సవం సందర్భంగా బుధవారం డ్రైవర్స్ డే నిర్వహిస్తున్నామని ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్వీఆర్ వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ఎంతో మంది ఉన్నత చదువులు చదివి అత్యున్నత స్థాయిలో ఉన్నారన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులకు భరోసాగా నిలుస్తూ ప్రతిరోజు వారిని గమ్యస్థానాలకు క్షేమంగా చేరవేస్తున్నారన్నారు. ఈ విషయం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరికీ తెలుసునని స్పష్టం చేశారు. ఈ మేరకు నిత్యం బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగస్తులు, ప్రయాణికులు, ప్రతి రోజు మీ ప్రాంతాల నుంచి క్షేమంగా మిమ్మల్ని గమ్యం చేరుస్తున్న డ్రైవర్లకు హ్యాపీ డ్రైవర్స్ డే అని మన స్ఫూర్తిగా అభినందించాలని కోరారు. ప్రయాణికుల అభినందనలు, ప్రోత్సాహం వారిలో ఒక స్ఫూర్తిని నింపి వారి సేవకు మరింత చేరువ అవడానికి స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని డ్రైవర్లను ఉత్సాహపరచాలని కోరారు.

30 లోగా డీఈఎల్ఈడీ పరీక్ష ఫీజు చెల్లించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : త్వరలో నిర్వహించబోయే డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) మూడో సెమిస్టర్ (2022–24 బ్యాచ్) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఫీజులు చెల్లించడానికి ఉద్దేశించిన షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ విడుదల చేశారని జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్‌సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 30వ తేదీలోగా ఫీజులు చెల్లించవచ్చన్నారు. అభ్యర్థులు నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.250, మూడు సబ్జెక్టులకు రూ.175, రెండు సబ్జెక్టులకు రూ.150, ఒక సబ్జెక్టుకు రూ.125 చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి ఈ నెల 24వ తేదీ నుంచి బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందన్నారు. రూ.50 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించేందుకు ఫిబ్రవరి 2వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

మెడికల్ కళాశాల పనులు వేగిరపర్చండి



దగ్గులూరులో పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అచ్యుత్ అంబరీస్

పాలకొల్లు అర్బన్ : మెడికల్ కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని నరసాపురం సబ్ కలెక్టర్ డా.అచ్యుత్ అంబరీస్ అధికారులను ఆదేశించారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులు మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని కోరారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సైట్, అండ్ ప్లానింగ్ డీఎంలు గోవిందరావు, దినేష్‌బాబు, లైజనింగ్ ఆఫీసర్ మంచెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు



మాట్లాడుతున్న డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్

ఏలూరు (మెట్రో): జిల్లాలో ప్రతి ఇంటికి జల్ జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ చెప్పారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో హర్ ఘర్ జల్‌కు సంబంధించి గ్రామ సభలు నిర్వహించని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎస్వీవీ సత్యనారాయణ కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షించారు. డీపీఓ మాట్లాడుతూ హర్ ఘర్ జల్ పథకంలో భాగంగా జిల్లాలో 4.80 లక్షల ఇళ్లకు గాను 4.07 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చామన్నారు. రూ.455 కోట్లతో 1,784 పనులు మంజూరైతే 665 పనులు పూర్తి అయ్యాయని, మరో 624 పనులు పురోగతిలో ఉన్నాయని, 495 పనులు కమ్యూనిటీ ద్వారా చేసుకోవచ్చని కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. జల్ జీవన్ మిషన్ అమలులో 85 శాతం పనులు పూర్తి చేసి జిల్లా ప్రగతి పథంలో ఉందని, 273 గ్రామాలను లక్ష్యంగా పెట్టుకుని హర్ ఘర్ జల్ గ్రామాలుగా డిక్లేర్ చేయవలసి ఉంటే ఇప్పటికే 258 గ్రామాలను డిక్లేర్ చేశామని, మిగిలిన 17 గ్రామాలను ఈ నెల జనవరి 27 నాటికీ డిక్లేర్ చేసి లక్ష్యం పూర్తి చేస్తామన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వాయిస్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, నవాజ్ హాజరయ్యారు.

జగన్ సంక్షేమ పాలనే శ్రీరామరక్ష



తిమ్మయ్యపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్

ఉంగుటూరు: సీఎం వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పాలనే వచ్చే ఎన్నికల్లో తమకు శ్రీరామరక్ష అని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి కారుమూరి సునీల్ స్పష్టం చేశారు. మంగళవారం తిమ్మయ్యపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. పెత్తందార్లను ఎదుర్కొంటూ పేదలకు సంక్షేమం అమలు చేసిన తీరును వివరించారు. ఓ వైపు సంక్షేమ పథకాల ద్వారా పేదలను ఆర్థికంగా ఆదుకుంటూనే మరో వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్నారన్నారు. స్థానిక పార్టీ నాయకులను కారుమూరి సునీల్‌కు వాసుబాబు పరిచయం చేశారు. సర్పంచ్ సింహాద్రి శ్రీదేవి, రైతు సలహా మండలి మండల చైర్మన్ సింహాద్రి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ మరడ రమావతి జెడ్పీటీసీ సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి, గోకవరం సర్పంచ్ మిద్దే సత్యవతి, మిద్దే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు బాసటగా ఆసరా

- 4వ విడతలో 39,574 డ్వాక్రా సంఘాలకు రూ.362.59 కోట్ల లబ్ధి
- కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేత



ఏలూరులో లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో) : ఏలూరు జిల్లాలో 39,574 స్వయం సహాయక సంఘాల్లోని 3,89,801 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత కింద రూ.362.59 కోట్ల రుణ మాఫీ నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. అనంతపురం జిల్లా ఉరవకొండ బహిరంగ సభ నుంచి మంగళవారం వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత నిధులు నేరుగా స్వయం సహాయక పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, మెప్మా పీడీ ఇమ్మానియేల్, పలు స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ 39,574 స్వయం సహాయక సంఘాలకు రూ.362.59 కోట్ల విలువైన మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ 34,569 మహిళా సంఘాలకు చెందిన 3,43,717 మంది మహిళలకు రూ.319.53 కోట్లు, అర్బన్ ప్రాంతంలో (మెప్మా) 5,005 మహిళా సంఘాలకు చెందిన 46,084 మంది మహిళలకు రూ.43.06 కోట్లు వారి బ్యాంకు ఖాతాలకు జమచేయడం జరిగిందన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో 6685 మహిళా సంఘాలకు చెందిన 65,922 మంది మహిళలకు రూ. 74.91 కోట్లు, దెందులూరు నియోజకవర్గంలో 5,438 మహిళా సంఘాలకు చెందిన 53,104 మంది మహిళలకు రూ. 53.70 కోట్లు, ఏలూరు నియోజకవర్గంలో 3,619 మహిళా సంఘాలకు చెందిన 33,002 మంది మహిళలకు రూ.27.80 కోట్లు, గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల మండలంలో 1,524మహిళా సంఘాలకు చెందిన 15,251 మందికి రూ.16.09 కోట్లు, కైకలూరు నియోజకవర్గంలో 5,181 మహిళా సంఘాలకు చెందిన 52,953 మంది మహిళలకు రూ.46.73 కోట్లు, నూజివీడు నియోజకవర్గంలో 5,771 మహిళా సంఘాలకు చెందిన 59,584 మంది మహిళలకు రూ.53.56 కోట్లు, పోలవరం నియోజకవర్గంలో 6,200 మహిళా సంఘాలకు చెందిన 59,170 మంది మహిళలకు రూ.44.18 కోట్లు, ఉంగుటూరు నియోజకవర్గంలో 5,156 మహిళా సంఘాలకు చెందిన 50,815 మంది మహిళలకు రూ.45.63 కోట్లు, జమ చేశామని వివరించారు.

వైఎస్సార్ సీపీ సమావేశాలకు తరలిరండి

- 25న ర్యాలీ, ద్వారకాతిరుమలలో విస్తృత స్థాయి సమావేశం
- రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత పిలుపు



ద్వారకాతిరుమల: రాష్ట్రంలో రెండోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత ముందుకు దూసుకెళ్తున్నారు. అందులో భాగంగా గోపాలపురం నియోజకవర్గంలో ఈనెల 25న నూతన క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవం, నియోజవర్గ నాయకుల పరిచయ వేదిక, విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించడానికి శ్రీకారం చుట్టారు. 25న ఉదయం 9 గంటలకు దేవరపల్లి మండలం యర్నగూడెం చేరుకుంటారు. 9.30 గంటలకు యర్నగూడెంలో నూతన క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొంటారు. అక్కడి నుంచి ఉదయం 10 గంటలకు ద్వారకాతిరుమలకు ర్యాలీగా తరలివెళతారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ద్వారకాతిరుమలలో కాపు కల్యాణ మండపం ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి సమక్షంలో హోంమంత్రి తానేటి వనిత అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి పరిచయ కార్యక్రమంతో పాటు విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొనాలని మంత్రి వనిత పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి, గోపాలపురం నుంచి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

పరిచయ వేదిక రెడీ



రేపల్లెవాడలో నిర్వహించే వైఎస్సార్‌సీపీ సదస్సుకు సిద్ధమైన రేపల్లెవాడలోని వేదిక

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్, పోలవరం అసెంబ్లీ ఇన్‌చార్జిల పరిచయ వేదికకు రేపల్లె వాడలోని సురేష్ హాల్ సిద్ధమైంది. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రీజనల్ కో–ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి హాజరుకానున్నారు. అదేవిధంగా పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కారుమూరి సునీల్, పోలవరం అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మితో సహా ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని ఏడు మండలాలతో సహా పార్లమెంటు పరిధిలోని ముఖ్య నాయకులు హాజరుకానుండటంతో ఏర్పాట్లను పూర్తి చేశారు. గణేష్ సెంటర్ నుంచి రెండు కిలోమీటర్ల మేర స్వాగతం పలకడానికి పార్టీ శ్రేణులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రేరేపిత రహిత ఎన్నికల నిర్వహణకు చర్యలు



కేంద్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): ప్రేరేపిత రహిత ఎన్నికల కోసం పర్యవేక్షణను మెరుగుపరిచేందుకు భారత ఎన్నికల సంఘం ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం ఈఎస్ఎంఎస్ యాప్ వినియోగంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాప్‌లో పొందుపరిచిన వివిధ అంశాలను ఈసీఐ ఐటీ విభాగం అధికారులు వివరించారు. గత ఏడాది దేశంలో ఐదు అసెంబ్లీ ఎన్నికల కోసం ఈ విధానాన్ని వినియోగించారన్నారు. ఈ విధానం అనేక రకాల రాష్ట్ర, కేంద్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ఫీల్డు నుంచి వచ్చే సీజర్లపై నిజ సమయ నవీకరణ కోసం ఒక సాంకేతిక వేదికగా నిలిచిందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల వేళ అక్రమంగా తరలించే నగదు, మద్యం, డ్రగ్స్, ఉచిత బహుమతులు, విలువైన వస్తువులను సీజ్ చేసేందుకు ఈఎస్ఎంఎస్ సిస్టమ్ యాప్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, ఇతర విలువైన వస్తువులు పట్టుబడినప్పుడల్లా స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు యాప్‌లోకి సమాచారాన్ని అప్‌లోడ్ చేస్తారన్నారు. భారీ లావాదేవీల కదలికలపై నిఘా ఉంచేందుకు కూడా పలు రకాల అంశాలు పొందుపర్చారన్నారు. ఈఎస్ఎంఎస్ సిస్టమ్ యాప్ సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జేడీ ఎన్.సూర్యచంద్రరావు, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ డి.శ్రీలక్ష్మి, డిప్యూటి కమీషనర్ డి.రామబాబు, డీఎఫ్ఓ ఎం.హిమశైలజ, డీటీసీ ఎస్.శాంతకుమారి, జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్ఎస్ కుమరేశ్వరన్, ఎల్‌డీఎం డి.నీలాద్రి, జిల్లా ఇన్ఫర్మెటిక్ ఆఫీసరు జీవీఎస్ఆర్ శర్మ పాల్గొన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు

ఏలూరు జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి జాతీయ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ) మెయిన్స్–1 పరీక్షలు ఏలూరు జిల్లాకు సంబంధించి ఏలూరులోని మూడు కేంద్రాల్లో బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏలూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో ఈ పరీక్షలు నిర్వహించడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఏర్పాట్లు చేసింది. ఈ మూడు కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు పి.సాయికుమారి శంకర్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అడ్మిట్ కార్డు, అండర్ టేకింగ్ ఫారమ్, రెండు ఫొటోలు, ఆధార్ కార్డు లేదా ఇతర ఏదైనా గుర్తింపు కార్డు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్లు, ఏ విధమైన వాచ్‌లు పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. ఫార్మల్ దుస్తులు ధరించి రావాల్సి ఉంటుంది. ఉదయం సెషన్‌లో పరీక్ష రాసేవారు పరీక్షా కేంద్రం వద్ద ఉదయం 7 గంటలకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. అలాగే మధ్యాహ్నం పరీక్ష రాసే వారు మధ్యాహ్నం ఒంటి గంటకు పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. కాగా ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు పరీక్ష కేంద్రాల ప్రధాన ద్వారాలను మూసివేస్తారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు తగు జాగ్రత్తలతో పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్షల ప్రారంభం రోజున మధ్యాహ్నం సెషన్‌లో మాత్రమే పరీక్ష ఉంటుంది. అనంతరం ఈ నెల 27, 30, 31, ఫిబ్రవరి 1వ తేదీన ఏలూరులోని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి.

క్లుప్తంగా

చరిత్రలో నిలిచిపోయే వ్యక్తి సీఎం వైఎస్ జగన్




డాక్టర్ పిడకాల శ్యామ్‌సుందర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని దేశంలోనే మకుటాయమానం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకాల శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ మేధావి అంబేడ్కర్‌కు అపురూపమైన గౌరవాన్ని ఇవ్వాలని ఆలోచించి దాన్ని ఆచరణలో పెట్టి ప్రపంచం అంతా నివ్వెరపోయేలా వైఎస్ జగన్ చేసి చూపించారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక గౌరవాన్ని తెచ్చిపెట్టిన ముఖ్యమంత్రికి ఏపీ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ తరుపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం విద్యను ప్రవేశపెట్టిన జగన్ దేశంలోనే గొప్ప సీఎంగా ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి పేదవాడు రుణపడి ఉంటాడన్నారు.

సాగుకు సేంద్రియ పద్ధతులే మేలు

- రసాయన ఎరువుల వాడకంతో ఎన్నో అనర్థాలు
- పంటల్లో కనిపిస్తున్న ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు
- ఈ పోషకాలు లోపిస్తే తగ్గిపోనున్న దిగుబడులు
- సేంద్రియ సాగుతో చెక్ పెట్టవచ్చని సూచన



చింతలపూడి: నేడు రైతాంగం తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటను పండించడానికి విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. ఫలితంగా భూముల్లో పంటలకు కావలసిన పోషకాలు అందుబాటులో లేక సమతుల్యత లోపించి ముందెన్నడూ లేని విధంగా ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు పంటల్లో కనిపిస్తుంది. ఈ పోషకాలు లోపించినప్పుడు సాగులో మిగతా యాజమాన్య పద్ధతులన్నీ సక్రమంగా పాటించకపోయినా దిగుబడులు తగ్గుతాయి. వీటిని అధిగమించడానికి సేంద్రియ వ్యవసాయ పద్ధతులు మేలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం నాగకుమార్ సూచిస్తున్నారు. చింతలపూడి సబ్ డివిజన్‌లో ఏటా రబీ సీజన్‌లో సుమారు 8,204 ఎకరాల్లో వరి, 27,774 ఎకరాల్లో మొక్కజొన్న, 689 ఎకరాల్లో వేరుశెనగ, 3,341 ఎకరాల్లో పొగాకు రైతులు సాగు చేస్తుంటారు. ఇవికాక మిర్చి, పొద్దుతిరుగుడు, చెరుకు, కూరగాయల పంటలు పండిస్తుంటారు.



మెట్ట ప్రాంతంలో నిమ్మతోటలో రైతులు పండిస్తున్న వేరుశెనగ పంట



కూరగాయల పంట

ఎరువుగా జిప్సం

జిప్సం రసాయన నామం. జిప్సంలో 24 శాతం కాల్షియం, 18 శాతం గంధకం ఉంటుంది. కాల్షియం, గంధకం మొక్కల పెరుగుదలకు అవసరమైన ద్వితీయ శ్రేణి పోషకాలను అత్యంత చౌకగా జిప్సం ద్వారా అందించవచ్చు. ముఖ్యంగా నూనె గింజలు, పప్పు ధాన్యాల వంటి పంటల్లో గంధకం ఆవశ్యకత అధికంగా ఉంటుంది. కాల్షియం మొక్కల్లోని జీవకణాల అంచులు గట్టిగా ఉండటానికి, కణ విభజనకు, వేర్ల అభివృద్ధికి గింజకట్టడానికి అవసరమవుతుంది. దీనివల్ల మొక్కలకు చీడపీడలను ఎదుర్కొనే శక్తి సమకూరుతుంది. వేరుశెనగ పంటలో జిప్సంను పూత దశలో వేసుకుని భూముల్లో కలియబెట్టడం వల్ల అధిక దిగుబడులు వస్తాయి. కాయలు కూడా గట్టిగా ఉండి కాయ నిండా పప్పు వృద్ధి చెంది గింజల్లో అధిక నూనె శాతం కలిగి ఉంటుంది. ఫలితంగా కాయలు అధిక బరువు కలిగి మంచి ధర పలుకుతాయి. కాబట్టి పూత సమయంలో ఎకరాకు 200 కిలోల చొప్పున భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు మొక్కలకు దగ్గరగా వేసుకోవాలి. బీడు, చౌడు భూముల్లో నీరు సరిగా ఇంకదు. గాలి ప్రసరణ తక్కువగా ఉంటుంది. భూమి భౌతిక లక్షణాలు క్షీణించి ఉంటాయి. ఈ పరిస్థితుల్లో మొక్కల వేర్లు సరిగా వృద్ధి చెందక మొక్కల్లో ఎదుగుదల ఉండదు. ఇలాంటి భూముల్లో జిప్సం వినియోగంవల్ల నేల గుల్లబారి భూమిలో నీరు ఇంకే స్వభావం పెరిగి మొక్కల వేర్లు బాగా వృద్ధి చెందుతాయి. పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుంది.



ఎం నాగకుమార్, ఏడీఏ వ్యవసాయ సబ్‌డివిజన్

రిపబ్లిక్ డే గాడ్ ఆఫ్ ఆనర్ ఈవెంట్‌కు ఎంపిక



ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ ఎ.వీరయ్యతో పవన్‌సాయి విఘ్నేష్

టి.నరసాపురం: ఢిల్లీలో కరియప్ప పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 26న జరిగే రిపబ్లిక్‌డే పరేడ్‌లో గాడ్ ఆఫ్ ఆనర్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం సాయంపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి మారిశెట్టి పవన్‌సాయి విఘ్నేష్ ఎంపికయ్యారు. విఘ్నేష్ భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గత మూడేళ్లుగా ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్నాడు. రిపబ్లిక్ డే పరేడ్ గాడ్ ఆఫ్ ఆనర్‌లో పాల్గొనేందుకు 8 దశల్లో జరిగిన ఎంపికల్లో ప్రతిభ చాటాడు. దేశం మొత్తంగా 100 మంది క్యాడెట్‌లు ఎంపిక కాగా, వారిలో ఏపీ నుంచి 8 మంది ఎంపికయ్యారు. వీరిలో విఘ్నేష్ ఒకరు. ఈ నెల 26న జరిగే గాడ్ ఆఫ్ ఆనర్‌లోను, 27న ప్రధానమంత్రి పాల్గొనే కార్యక్రమంలోనూ గాడ్ ఆఫ్ ఆనర్‌లో విఘ్నేష్ కవాతు చేయనున్నాడు. తన ఎంపికకు భీమవరం కళాశాల ఎన్‌సీసీ విభాగం అధికారి కెప్టెన్ డాక్టర్ ఎ.వీరయ్య శిక్షణ దోహదపడిందని పేర్కొన్నాడు. విఘ్నేష్ తండ్రి మారిశెట్టి దేవవరప్రసాద్ తాపీ మేస్త్రీ కాగా తల్లి సత్యవతి గృహిణి. గాడ్ ఆఫ్ ఆనర్‌కు ఎంపిక కావడం వల్ల ఎన్‌సీసీలో సి-సర్టిఫికెట్ ఎగ్జామ్‌లో 50 మార్కులు యాడ్ అవుతాయని, దీని ద్వారా ఆర్మీలో అధికారి ఉద్యోగానికి వెళ్లేందుకు సులభతరం అవుతుందని విఘ్నేష్ తెలిపాడు.

కవిప్రసాద్‌కు ఉత్తమ పురస్కారం

తణుకు: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న హైదరాబాదులో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ ఉత్తమ పురస్కారం అందుకున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కవి ప్రసాద్ రచించి చదివి వినిపించిన విగ్రహాలు అనే కవితకు పురస్కారం లభించింది. వేదిక అంతర్జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షులు ఈశ్వరి భూషణం, చిట్టే లలిత చేతుల మీదుగా ప్రసాద్‌కు పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలూరు (టూటౌన్): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిది అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా న్యాయ సేవా భవన్ నందు మంగళవారం పర్యావరణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఏపీ పొల్యూషన్ బోర్డు ఏలూరు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు, ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి బాధ్యతతో జీవనం సాగిస్తూ, ప్రకృతిని పరిరక్షించడంలో భాగస్వాములు కావాలని అన్నారు. సహజ జీవనవిధానం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని అన్నారు. చెట్లను నాటడం, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును ఉపయోగించటం, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించడం మొదలైన కార్యక్రమాలను అవలంభించడం ద్వారా కొంతవరకు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అని అన్నారు. ఏలూరు జిల్లా పర్యావరణ రక్షణ బోర్డు ఇంజినీర్ ఈ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యం వ్యర్థాల రీసైక్లింగ్ విధానాన్ని పాటించాలని, విధిగా శుద్ధి చేసిన తర్వాత మాత్రమే వ్యర్థాలను విడుదల చేయాలని సూచించారు. పంటలకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, ఎలక్ట్రానిక్, ఆసుపత్రుల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో డిస్మాండిల్ చేయాలని, ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించి జ్యూట్ వస్తువులను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శేషగిరిరావు, ప్యానల్ లాయర్లు కె.వెంకటేశ్వరరావు, కూనా కృష్ణారావు, కట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

యువకుడి అనుమానాస్పద మృతి

నూజివీడు: పట్టణంలోని మొఘల్ చెరువు ప్రాంతంలో నివాసముండే పరసా రంజిత్‌కుమార్ (28) అనే యువకుడు సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంజిత్‌కుమార్ మధ్యాహ్న సమయంలో పడుకోగా నిద్రలోనే అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై ఎస్ శంకర్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం మార్చురీకి తరలించారు.

జంగారెడ్డిగూడెంలో చోరీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఓ ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన అల్లాడి సత్యవతి మండలంలోని తాడువాయి పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తోంది. మంగళవారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని ఆమె గుర్తించింది. ఇంటిలోకి వెళ్లి చూసేసరికి బీరువాలో ఉన్న ఉంగరాలు - 2, చైన్ - 1, సూత్రాలు 4, మొత్తం రెండున్నర కాసుల బంగారం, రూ.20వేలు నగదు, 20 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సాక్షి క్లాసిఫైడ్స్



■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R.6555]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999 [B.6064]

BUSINESS OFFER

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్‌ప్లేట్స్ & LEDబిజినెస్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-1427]



■ మా సంస్థ ద్వారా ఏలూరు నడిపల్లి వెలగలపల్లి ఫ్యాక్టరీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ సెక్యూరిటీ సూపర్ వైజర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 12గం॥ డ్యూటీ. సెల్ :99895 30260. [P-192855]

■ విజయవాడలో ఇంటివద్దనే వుండి పేషెంట్‌లను /పెద్దవారిని చూసుకొనుటకు అనుభవం వున్న M/F కేర్ టేకర్స్ / నర్సులు కావలెను. రూమ్+భోజనం + మంచి జీతం ✆ 91608 35559, 78158 35561 [B.623]

■ **Wanted Female Telecallers in Eluru.** Qlf: Inter / Degree & Comm Skills Sal: 10,000 to 15,000 + Inct + Bonus. W. Timings: 9.30am - 6pm. ✆ 89789 97546. [B-1239160]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167505]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024 / 9640400073 [HA-1109]

■ జంగారెడ్డిగూడెం, ద్వారకా తిరుమల, నల్లజెర్ల, మా బ్రాంచ్‌లో ఆన్‌లైన్ ఉత్పత్తులు డెలివరీ చెయ్యడానికి డెలివరీ బాయ్స్ కావలెను. మంచి జీతం, బైక్, స్మార్ట్ ఫోన్ ఉండాలి. వ: 18+. Ph: 7207141295, 8686242288 [HA-1131]

■ దూబచర్ల ప॥గోదావరి జిల్లా ఫ్యాక్టరీలో పని చేయుటకు సె॥ గార్డ్స్, సె॥ సూపర్‌వైజర్. 8 గం॥ డ్యూటీ. ESI, PF ఉచిత వసతి కలదు, అర్హత: 10th, వయస్సు: 50 సం॥ల లోపు, జీతం: 11 వేల నుండి 13 వేలు. ఫోన్: 9548112112. [H-788198]

■ 10 వేలు పెట్టుబడి పెట్టగల రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ చేయువారు కావలెను, మంచి ఆదాయం + Free Flat పొందండి. టీమ్ సపోర్ట్, ట్రైనింగ్ ఇవ్వబడును. ఫోన్: 76598 14393. [HA-7002]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233754]

■ రామకృష్ణ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ:జీ: 15-21 వేలు, ఏజెంట్లకు 5వేలు కమీషన్ ✆ 6281208567, 8247450643 [B-1239060]

■ బాలాజీ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ:జీ: 15-21 వేలు, ఏజెంట్లకు 5వేలు కమీషన్ ✆ 92814 52843, 92814 52828 [B-1239061]

■ బెంగుళూరు దగ్గరలో ఉన్న రాయల్ విద్యా సంస్థలలో పనిచేయుటకు క్రింది టీచర్స్, లెక్చరర్స్ కావలెను. 1) LKG to 10th(CBSE, ICSE) అన్ని సబ్జెక్టులకు, 2)లెక్చరర్స్, 11th & 12th క్లాసులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ, ఇంగ్లీషు మరియు కామర్స్ లెక్చరర్స్ కావలెను. ఇంటర్వ్యూ: 26-01-2024, టైమ్:10am-5pm, వెన్యూ: గోదావరి కోచింగ్ సెంటర్, కోటిపల్లి బస్టాండ్‌దగ్గర, రాజమండ్రి. సంప్ర॥ 7259923456, 9008169699, 8919835884 [G-1217]



గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మహిళ హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

ఏలూరు (టూటౌన్): మహిళను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన కేసులో ముద్దాయికి ఏలూరు ఎనిమిదవ అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎం.సునీల్ కుమార్ జీవిత ఖైదు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు, అడిషనల్ పీపీ డి.శ్రీవాణి బాయ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భర్త చనిపోయిన నేపథ్యంలో అల్లాడి దుర్గ తన పుట్టిల్లు అయిన పెదపాడు మండలం ఏపూరులో తల్లిదండ్రుల ఇంటి వద్ద నివాసం ఉంటుంది. ఈ క్రమంలో కృష్ణా జిల్లా బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ ప్రాంతానికి చెందిన బెజవాడ వీర వెంకట శివశంకర్ అనే వ్యక్తి ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. వారిద్దరూ కొంతకాలం సహజీవనం చేశారు. ఈ క్రమంలో 2015 డిసెంబరు 13న ముద్దాయి శివశంకర్ అల్లాడి దుర్గను దిండుతో ఊపిరి ఆడకుండా చేసి అనంతరం ఉయ్యాల చీరతో మృతురాలు తనంతట తాను ఉరి వేసుకున్నట్లుగా సాక్ష్యాలను సృష్టించాడు. దీనిపై అనుమానంతో మృతురాలి తల్లి పోలుకొండ ఝాన్సీ పెదపాడు పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముద్దాయిని అప్పటి ఏలూరు డీఎస్పీ కేజీవీ సరిత అరెస్టు చేసి దర్యాప్తు అనంతరం ఛార్జిషీట్‌ను కోర్టులో ఫైల్ చేశారు. ఈకేసులో ఐపీసీ సెక్షన్ 302, 201 కేసులను నమోదు చేశారు. దీనిపై వాదనలు పూర్తికావడంతో ముద్దాయి శివశంకర్‌కు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కేసులో జీవిత కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. 201 కేసులో మూడేళ్ల శిక్ష, రూ.5వేలు జరిమానాను జడ్జి ఎం.సునీల్ కుమార్ విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పీపీ డి.శ్రీవాణి బాయ్ వాదనలు వినిపించారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి విచారణలో సహకరించిన పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాసరావు, పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ, కోర్టు కానిస్టేబుల్ సీహెచ్ క్రాంతి కుమార్‌లను జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అభినందించారు.

పెదతాడేపల్లి గురుకుల బ్యాండ్‌కు ద్వితీయ బహుమతి

తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల బ్యాండ్‌కు జాతీయస్థాయి పోటీల్లో ద్వితీయస్థానం లభించిందని ప్రిన్సిపాల్ బి.రాజారావు మంగళవారం తెలిపారు. రిపబ్లిక్‌డే వేడుకల్లో భాగంగా ఈ నెల 21, 22 తేదీల్లో ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ జాతీయ స్టేడియంలో జాతీయస్థాయి పాఠశాల బ్యాండ్ పోటీలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 14 పాఠశాలలకు చెందిన బ్యాండ్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. సౌత్‌జోన్ తరపున బాలుర విభాగంలో రాష్ట్రానికి పెదతాడేపల్లి గురుకుల విద్యార్థులు ప్రాతినిధ్యం వహించి రెండో స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల సెక్రటరీ మహేష్‌కుమార్, రాష్ట్ర సమగ్ర శిక్షణ అభియాన్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, డీసీఓ సంజీవరావు, ఎంఈఓ హనుమ తదితరులు అభినందనలు తెలిపారు.



జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి పొందిన పెదతాడేపల్లి గురుకుల బ్యాండ్

29 నుంచి విద్యుత్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పీ.సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏలూరులోని విద్యుత్ భవన్‌లో, తాడేపల్లిగూడెం, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, భీమవరం, నరసాపురంలలోని తమ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల కార్యాలయాల్లో ప్రజాభిప్రాయాలను స్వీకరిస్తామన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిరోజు అన్ని డిస్కమ్‌ల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ కార్యక్రమం ఆయా తేదీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారని, ఈ ధరలపై సందేహాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులెవరైనా పాల్గొనవచ్చున్నారు.

పాదముద్రల సేకరణ

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం ఎర్రాయిగూడెం సమీపంలో గ్రామస్తులు అనుమానిస్తున్నట్లుగా ఉన్న పులి పాదముద్రలను మంగళవారం ఫారెస్ట్ అధికారులు సేకరించారు. వాటిని రాజమండ్రి వైల్డ్‌లైఫ్ ల్యాబొరేటరీకి పంపించారు. ప్రజలెవ్వరూ భయపడవద్దని ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.కృష్ణకుమారి అన్నారు. పాదముద్రలు సేకరించిన వారిలో వైల్డ్‌లైఫ్ సిబ్బంది కె.సుధీర్, ఎం.సోమరాజు, వై.బుచ్చన్నదొర, బీట్ గార్డ్ తదితరులు పాల్గొన్నారు.

జంతువుపై పులి దాడి?

మండలంలోని పులిరామన్నగూడెం పరిసర ప్రాంతంలో మేతకు వెళ్లిన జంతువుపై పులి దాడి చేసినట్లు సమాచారం. అయితే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. జంతువుపై పులి దాడి సంఘటనకు సంబంధించి వైల్డ్ లైఫ్ అధికారులు బుధవారం పూర్తి వివరాలు సేకరించేందుకు వెళ్తున్నట్లు సమాచారం.



ఎర్రాయిగూడెం సమీపంలో సేకరించిన పాదముద్రలు

చైన్ స్నాచర్ అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఆగిరిపల్లి: మహిళల మెడలో బంగారపు గొలుసులు దొంగతనం చేస్తున్న చైన్‌స్నాచర్‌ను మంగళవారం ఆగిరిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం ఇటీవల మండలంలోని తోటపల్లి, శోభనాపురం గ్రామాల్లో ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న ఇద్దరు మహిళల మెడలో నుంచి చిన్నాగిరిపల్లికి చెందిన జువ్వనబోయిన రామకృష్ణ బంగారం గొలుసులు దొంగతనం చేసి పరారయ్యాడు. ఈ నేపథ్యంలో ఎస్సై చంటిబాబు తన సిబ్బందితో కలిసి దాడి చేసి అతడిని పట్టుకున్నారు. రూ.2 లక్షల 25 వేల విలువ గల రెండు బంగారు చైన్‌లు స్వాధీనం చేసుకుని, చైన్ స్నాచర్‌ని అరెస్ట్ చేసి నూజివీడు కోర్టులో హాజరుపరిచారు.